డిగ్రీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు)లో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ బిఎ, బికాం, బిఎస్‌సిల్లో డిగ్రీలో ప్రవేశాలకు ఈనెల పదో తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. పలు డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందడానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియను కళాశాలలో ఉచితంగా కల్పించినట్లు తెలిపారు. బిఎలో ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, స్పెషల్ తెలుగు, స్పెషల్ ఇంగ్లీష్, కోర్సులు.. బి.కాంలో బి.కాం జనరల్, బి.కాం కంప్యూటర్ అప్లికేషన్స్, బి.కాం ఫైనాన్స్... బిఎస్‌సిలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, జువాలజీ, బోటనీ, బయోటెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 9705722300, 7989816610, 9490608636, 9491325039 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కలెక్టర్‌గా స్వప్నిల్ దినకర్

మనజీర్ జిలానీ సమూన్ బదిలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్

జిల్లా నూతన కలెక్టర్‌గా స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఐఎఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జిఒ నంబరు 1160ను విడుదల చేసింది. అందులో భాగంగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన్ను శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేసింది. ఇప్పటివరకు కలెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను బదిలీ చేసింది. ఆయనకు ఇంకా పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. స్వప్నిల్ దినకర్ 2016 బ్యాచ్ ఐఎఎస్ అధికారి. మహారాష్ట్రకు చెందిన ఆయన 1985 సెప్టెంబరు పదో తేదీన జన్మించారు. 2012లో గౌహతి ఐఐటిలో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశారు. తొలిసారి సివిల్స్ రాసి ఐపిఎస్‌కు ఎంపికయ్యారు. సివిల్స్ లక్ష్యంగా సాధన చేసి 2016లో ఐఎఎస్‌కు ఆంధ్ర కేడర్‌లో ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం విశాఖపట్నం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో ఆర్‌జెడిగా పనిచేశారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన అనంతరం 2019లో నూజివీడు సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. తర్వాత కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. అక్కడ్నుంచి చిత్తూరు జిల్లా సబ్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లి 2022 ఏప్రిల్ ఆరో తేదీన విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా నియమితులయ్యారు. నేటివరకు అదే పోస్టులో

కొనసాగుతున్న ఆయన్ను శ్రీకాకుళం జిల్లాకు కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను నగరపాలక సంస్థ కమిషనర్‌గా బదిలీ చేసింది. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేసిన ఆయన భార్య తమీమ్ అన్సారియా ఇటీవల ఐఎఎస్‌ల బదిలీల్లో ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన విషయం విదితమే. దీంతో ఆయన కూడా బదిలీ అవుతారన్న చర్చ సాగింది. ఊహించినట్లుగానే రెండో విడత ఐఎఎస్ బదిలీల్లో ఆయన బదిలీ అయ్యారు. మనజీర్ జిలానీ సమూన్ ఈ ఏడాది ఫిబ్రవరి రెండో తేదీన జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తూ సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు.

లెక్కలు వేస్తున్నారు

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో మండల, గ్రామస్థాయిల్లో పెద్దఎత్తున మార్పులు, చేర్పులు చేసేందుకు టిడిపి నాయకులు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. దీంతో మండలాల్లో ఎవరెవరిని మారుస్తారనే చర్చ జోరుగా సాగుతోంది. గ్రామాల్లో వాలంటీర్లు, రేషన్ డీలర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల్లో తమ వారిని నియమించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ముందుగా వాలంటీర్లు, డీలర్లు, ఆ తర్వాత ఫీల్డ్ అసిస్టెంట్లను మార్పు చేయాలన్న ఆలోచనలో టిడిపి నాయకులు ఉన్నారు. ఎవరెవరిని మార్పు చేయాలన్న దానిపై గ్రామస్థాయి నాయకులు జాబితాలను సిద్ధం చేసి, ఎమ్మెల్యేల ముందు ఉంచనున్నారు.

- ముందు వాలంటీర్లు, డీలర్లు, ఆ తర్వాత ఫీల్డ్ అసిస్టెంట్లు
- నియోజకవర్గాల వారీగా జాబితాలు
- మార్పులు, చేర్పులకు రంగం సిద్ధం

ప్రజాశక్తి - కవిటి

2019లో వైసిపి ప్రభుత్వం వచ్చాక సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. అందులో భాగంగా 50 ఇళ్లకు ఒక వాలంటీరును నియమించింది. అలాగే డీలర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్వాడీలు, ఆశాలు... ఇలా అన్నిస్థాయిలో వైసిపి నాయకుల సిఫార్సులకే పెద్దపీట వేశారు. అంతా వారి హవానే కొనసాగించారు. ఇప్పుడు తమవంతు వచ్చిందని టిడిపి నాయకులు బహిరంగంగానే చెప్తున్నారు. ఇందులో భాగంగా తొలుత వాలంటీర్లపై దృష్టిసారించారు. వైసిపి ప్రభుత్వంలో వాలంటీర్లే అన్నీ అయి చేశారు. సంక్షేమ పథకాల పంపిణీకి మాత్రమే పరిమితం కాకుండా, స్థానిక సంస్థలు, సార్వత్రిక ఎన్నికల్లోనూ వైసిపి కోసం పనిచేశారని ఇప్పటికే టిడిపి నాయకులు ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో వాలంటీర్ల పాత్ర లేకుండా చూడాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు కూడా చేశారు. వైసిపి నాయకులు, కార్యకర్తలనే వాలంటీర్లుగా నియమించారని, వారందరినీ తొలగించాలని కొంతమంది టిడిపి నాయకులు పట్టుబడుతున్నట్లు తెలిసింది.

మరోవైపు చౌకదుకాణ డీలర్ల మార్పులపైనా ఆలోచనలు చేస్తున్నారు. ఇప్పటికే టిడిపికి అనుకూలంగా ఉండే డీలర్లు ఎవరు? వైసిపి నాయకులకు వెన్నుదన్నుగా నిలిచిన డీలర్లు ఎవరన్న లెక్కలు కూడా వేసుకున్నారు. కొన్నాళ్ల తర్వాత మార్పు చేయాలని టిడిపి పెద్దల్లో ఆలోచన ఉండగా, గ్రామస్థాయిలో మాత్రం తక్షణం మార్పు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని సమాచారం. మండలాల వారీగా ఎమ్మెల్యేల అనుచరులు వాలంటీర్లు, డీలర్ల జాబితా తీసుకొని ఇందులో ఏ పార్టీ సానుభూతిపరులు ఎందరనే లెక్క కూడా వేసినట్లు తెలుస్తోంది.

ఆ తర్వాత ఉపాధి హామీలోనూ..

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీలో ఎక్కవగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులే ఉంటారు. వీరిలో కూడా వైసిపి సానుభూతిపరులు, వైసిపి నాయకుల సిఫార్సు ద్వారా పోస్టింగ్‌లు పొందిన వాళ్లు ఉన్నారు. 2019కు ముందు టిడిపి ప్రభుత్వ హయాంలో విధుల్లో చేరిన వారిలో కొందరిని తొలగించింది. ఇప్పుడు వైసిపి సిఫార్సులతో విధుల్లో చేరిన వారిని బయటకు పంపించి, వారి స్థానంలో తమ వారికి చోటు కల్పిస్తామంటూ టిడిపి నాయకులు చెప్తున్నారు. మొన్న ఎన్నికల్లో తటస్థంగా ఉంటూ పనిచేసిన వారిని కాకుండా వైసిపికి అనుకూలంగా పనిచేసిన వారిని మారుస్తారని, వారి స్థానంలో ఎవరికి అవకాశం ఇవ్వాలనే జాబితానూ తయారు చేస్తున్నట్లు సమాచారం. వైసిపి ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకుల సిఫార్సుతో భర్తీ చేసిన అంగన్వాడీ పోస్టులపైనా టిడిపి నాయకులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

అన్ని శాఖల్లోనూ..

మండలాల్లో పలు ప్రభుత్వ శాఖల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో నియమితులైన వారిలో చాలా మంది వైసిపికి అనుకూలంగా ఉన్న వారే ఉన్నారని టిడిపి నాయకులు భావిస్తున్నారు. వారిని మార్చి వారి స్థానంలో తమ వారిని నియమించుకునేందుకు చర్చలు జరుపుతున్నారు. చాలాచోట్ల అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలను మార్పులు చేయడం ద్వారా, దాని పరిధిలో తమ వారికి అవకాశం ఇవ్వడంపై చోటా నాయకులు మంతనాలు చేస్తున్నారు. రానున్న రోజుల్లో వీటి విషయంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయాలు వెలువరుస్తుందో వేచిచూడాలి.

10న అఖిల భారత కోర్కెల దినం

- దేశవ్యాప్త నిరసనల్లో భాగస్వాములు కావాలి
- సిఐటియు పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అఖిల భారత కోర్కెల దినాన్ని పురస్కరించుకుని ఈనెల పదో తేదీన దేశవ్యాప్త నిరసనల్లో జిల్లాలోని కార్మికులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సంఘ జిల్లాస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే బిజెపి తన పాత విధానాలనే కొనసాగించడానికి సిద్ధమవుతోందన్నారు. అన్నింటికంటే ప్రమాదకరమైన లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి సిద్ధమవుతోందని తెలిపారు. లేబర్ కోడ్‌లు అమలైతే సమ్మెలు చేయడం కూడా సాధ్యం కాదన్నారు. పనివేళలు పెంచడం, ఉన్న హక్కులు తొలగించడం, జీతాలు పెంచకపోవడం, నిర్బంధాన్ని తీవ్రతరం చేయడం యాజమాన్యాలకు సులువు అవుతుందని చెప్పారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, సేంద్రీయ వ్యవసాయం, 108, 104 తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, వారికి కనీస వేతనాలు చెల్లించాలని, పెన్షన్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు నెలకు రూ.26 వేలు చొప్పున నిర్ణయించి అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, కంటింజెంట్, పార్ట్ టైమ్, గెస్ట్ తదితర ఉద్యోగ, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో హైడ్రాలిక్ ఫోమ్ ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయాలన్నారు. శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ రింగ్స్ యాజమాన్యం తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. రిమ్స్ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. నీలం జ్యూట్ పరిశ్రమను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. యునైటెడ్ బ్రూవరీస్, రెడ్డీస్ లేబొరేటరీస్, అరబిందో, మందస రైస్‌మిల్లు కార్మికుల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చాలన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, జిల్లా కార్యదర్శులు ఎన్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవన ప్రమాణాల పెంపు

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

మత్స్యకార గ్రామాల్లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ వెల్లడించారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుపరిచేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. నగరంలోని మత్స్యశాఖ జిల్లా కార్యాలయంలో మత్స్యశాఖ అధికారులు, మత్స్యకార సంఘాల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శ్రీకాకుళం, గార మండలాల్లో తీర ప్రాంతం ఎక్కువగా ఉన్నా, సరైన సదుపాయాలు, ఉపాధి లేక మత్స్యకారులు వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు మినీ జెట్టీ అవసరమని, దాని నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

పెద్దగణగళ్లవానిపేట తీరప్రాంతం కోతకు గురవుతోందన్నారు. నాగావళి నది సముద్రంలో కలిసే ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణానికి అవకాశాలు పరిశీలించి ప్రణాళికలు తయారు చేస్తే ఉన్నతాధికారులతో మాట్లాడతానని చెప్పారు. చేపల చెరువుల ఆక్రమణలపై అధికారులు దృష్టిసారించాలన్నారు. నియోజకవర్గంలో మత్స్యకారుల అభివృద్ధికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారం కోరనున్నట్టు తెలిపారు. సమావేశంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఎస్ఇ పి.సుధాకర్, మత్స్య సహకార సంఘాల పూర్వ అధ్యక్షులు మైలపల్లి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

- పరిశ్రమలకు కేటాయించిన భూమి వివరాలు ఇవ్వాలి
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఇండస్ట్రీస్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక యూనిట్లలో రసాయన ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా ఎపిఎంఐపి ద్వారా కేటాయించిన భూములతో పాటు వాటి ప్రస్తుత పరిస్థితిపై సమగ్రమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఏ పరిశ్రమ ఏర్పాటుకు భూములు తీసుకున్నదీ, ప్రస్తుతం అందులో ఉన్న పరిశ్రమ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలకు మంజూరు చేసిన భూమి వినియోగంలో లేకపోతే ఆ భూముల వివరాలు ఇవ్వాలన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూమి కావాలని దరఖాస్తు చేసినా, భూములు కేటాయించని స్థితిలో ఉన్న దరఖాస్తుల వివరాలు తెలపాలన్నారు. ఇండస్ట్రీస్ ఇన్‌ఛార్జి జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు రమణారావు మాట్లాడుతూ జిల్లాలో 23 భారీ పరిశ్రమలు రూ.5885.69 కోట్ల పెట్టుబడితో స్థాపించి 12,769 మందికి ఉపాధి కల్పిస్తున్నాయని తెలిపారు. మరొక భారీ, మధ్యతరహా పరిశ్రమ నిర్మాణ దశలో ఉందని వివరించారు. రూ.150 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమ పూర్తయితే 200 మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో 4,597 ఎంఎస్ఎంఇలు రూ.412.00 కోట్ల పెట్టుబడితో స్థాపించినట్లు తెలిపారు. వీటి ద్వారా 16,515 మందికి ఉపాధి లభిస్తోందని చెప్పారు. ఈ ఏడాది మే చివరి వరకు 369 ఎంఎస్ఎంఇలు రూ.10.10 కోట్ల పెట్టుబడితో స్థాపించి 1401 మందికి ఉపాధి కల్పించినట్లు వివరించారు. సులభతర వాణిజ్య పరిశ్రమలకు అవసరమైన అన్నిరకాల అనుమతులు ఆన్‌లైన్ ద్వారా 21 రోజుల్లో మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఐడిపిని 2023-27 ప్రభుత్వం ప్రకటించిందని దీని ప్రకారం జనరల్, బిసి అభ్యర్థులకు 15 శాతం పెట్టుబడి రాయితీ రూ.20 లక్షలకు మించకుండా, మహిళలకు రూ.30 లక్షలకు మించకుండా ఇస్తున్నట్లు తెలిపారు. వంద శాతం ఎస్‌జిఎస్‌టి ఐదేళ్ల వరకు మూడు శాతం వడ్డీ రాయితీ రూ.25 లక్షలు మించకుండా ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, సిటిఒ రాణిమోహన్, ఎల్‌డిఎం సూర్యకిరణ్, డ్వామా మేనేజర్ మురళీ, మైనింగ్ ఎడి సత్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాగావళి ఎడమ కాలువ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - బూర్జ

పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

నాగావళి ఎడమ కాలువను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతానని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ హామీనిచ్చారు. మండలంలోని నారాయణపురం ఆనకట్టతో పాటు నాగావళి ఎడమ కాలువను మంగళవారం పరిశీలించారు. ఏటా ఎడమ కాలువ ద్వారా భూములకు సాగునీరందడం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా ఈ కాలువ నుంచి ఆమదాలవలస, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, బూర్జ మండలాల పరిధిలోని అన్ని గ్రామాలకు సాగునీరందేదని తెలిపారు. కొంతకాలంగా కాలువల పరిస్థితి దయనీయంగా ఉండడంతో సాగునీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ పూర్తిస్థాయిలో కాలువను అభివృద్ధి చేసి శివారు భూములకూ సాగునీరందేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఇరిగేషన్ ఎస్ఇ సుధాకర్‌ను కాలువ పరిస్థితిపై ఆరా తీశారు. కాలువ అభివృద్ధికి అంచనాలు రూపొందించాలని సూచించారు. అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇఇ మురళీమోహనరావు, జెఇ రాంబాబు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఇపిడిసిఎల్ యాప్‌లో విద్యుత్ బిల్లుల చెల్లింపు

విశాఖపట్నం : విద్యుత్ వినియోగదారులు బిల్లులను ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) మొబైల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా చెల్లించవచ్చని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌బిఐ మార్గదర్శకాలను అనుసరించి ఇకపై ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం, ఇతర యుపిఐ యాప్‌ల్లో విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు ఇపిడిసిఎల్ పేరు కనిపించదని తెలిపారు. వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్ eastern powerని గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని గానీ, సంస్థ వెబ్‌సైట్ www.apeastern-power.com నుంచి గానీ బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. యాప్‌లో గానీ వెబ్‌సైట్‌లో గానీ బిల్లులు చెల్లించేటప్పుడు యుపిఐ యాప్‌లతో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వ్యాలెట్, క్యాష్ కార్డులు వాడుకోవచ్చని తెలిపారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

రిమ్స్ కార్మికుల ధర్నా

ధర్నా చేస్తున్న రిమ్స్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రిమ్స్ కార్మికుల కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని రిమ్స్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బి.మురళి, కోశాధికారి ఆర్.చిన్నారావు, సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు హెచ్చరించారు. లేకుటే తర్వాత పరిణామాలకు కాంట్రాక్టర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ రిమ్స్ వైద్య కళాశాల, సర్వజనాస్పత్రిలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు సర్వజనాస్పత్రి ప్రధాన గేటు వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిమ్స్‌లో శానిటేషన్, సెక్యూరిటీ కార్మికుల వేతనాలు, ఇపిఎఫ్, ఇఎస్ఐ క్రమం తప్పకుండా చెల్లించడం లేదని చెప్పారు. ఏళ్ల తరబడి వేతనాలు పెంచుకుండా వెట్టిచాకిరీకి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత్తం అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్లుగా ఉన్న కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ ఏజెన్సీ, సాయి సెక్యూరిటీ ఏజెన్సీ యాజమాన్యాలు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని, ఇఎస్ఐ, ఇపిఎఫ్ వారికి నచ్చినట్లు చెల్లిస్తున్నారని తెలిపారు. మూడేళ్లలో ఒక్కసారీ నిర్ణీత వేళల్లో వేతనాలు చెల్లించలేదని విమర్శించారు. కోవిడ్ సమయంలో మృతి చెందిన వారికి నేటికీ నష్టపరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ రెండు ఏజెన్సీలను రద్దు చేసి ఆప్కాస్ పరిధిలో చేర్చాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు అమలు చేస్తున్న రూ.21వేల వేతనాన్ని రిమ్స్ కార్మికులకు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి.కృష్ణవేణి, ఎ.సావిత్రి, కె.రవి, ఎం.సూర్యనారాయణ, బి.సంతోషి, డి.భారతి తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణకు చర్యలు

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు నియంత్రణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. ధరల నియంత్రణ కమిటీ సమావేశంలో భాగంగా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పౌర సరఫరాలు, మార్కెటింగ్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు ఇష్టానుసార ధరలకు విక్రయించకుండా మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

కూరగాయల ధరలు పెరుగుతున్న దృష్ట్యా రైతులకు లాభదాయకంగా, వినియోగదారులకు సరసమైన ధరలకు అందించే క్రమంలో సరఫరాదారులను గుర్తించి నివేదిక అందించాలన్నారు. టమోటా, ఉల్లి తదితర కూరగాయలు రైతుబజార్లలో తక్కువ ధరకు అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులను సంప్రదించి దిగుమతి చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బి.శాంతిశ్రీ, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ రాణి మోహన్, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు జె.ఎస్ నాగలక్ష్మి జ్యోతి, రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF 3rd ADDITIONAL JUNIOR CIVIL JUDGE (PROHIBITION & EXCISE COURT) AT SRIKAKULAM
I.A 77/2022 in O.S 212/2022

Between:
Reddi Varalakshmi. ...Petitioner/Plaintiff.
And:
Banna Thavitamma & 3 others ...Respondents/Defendants.

To,
R-2: Banna Lakshmana Rao, S/o late Appa Rao, aged about 40 years, Hindu, resident of Balaga, Near Jawahar Children School, Srikakulam Town and District.
R-4: M. Neeraja, w/o Lakshmana Rao, aged about 38 years, Hindu, Household duties, resident of Mendapeta village, Srikurmam post, Gara mandal, Srikakulam District.

Please take notice that the above Petition in IA.77/2022 in OS.212/2022 matter is posted to **09-07-2024** for your appearence. So you are here by directed to appear before the above court **at 10:30 AM., on 09-07-2024** in person or through Advocate without fail. otherwise the mattar will be decided in your absence

// BY COURT ORDER. //

P.S. GANDHI
ADVOCATE, SRIKAKULAM,
CELL: 9398029523.

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజా నాయకుడు ఓంకార్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రజా నాయకుడు బత్తిని ఓంకార్ మాస్టర్ మృతికి నగరంపల్లి సిపిఎం శాఖ సభ్యులు ఘనంగా నివాళ్లర్పించారు. నగరంపల్లిలో ఓంకార్ చిత్రపటానికి మంగళవారం సిపిఎం నాయకుడు ఎస్.భైరాగి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ప్రజా గాయకులు సిస్టు మనోజ్, చంద్రయ్యలు ఓంకార్‌పై పాడిన పాట అందరినీ కంటతడి పెట్టించింది. అనంతరం టి.భాస్కరరావు అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, నెయ్యిలు మోహనరావులు మాట్లాడుతూ ఉద్యమాలే తన ఊపిరిగా ఓంకార్ జీవిత ప్రయాణం సాగిందని కొనియాడారు. ఓంకార్ 9వ తరగతి చదువుతున్న నాటి నుంచే ఉద్యమంలో భాగంగా ఎస్ఎఫ్ఐలో చేరి అనేక పోరాటాలు చేశారని పేర్కొన్నారు. చదువు అనంతరం యువజన ఉద్యమాల్లో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. ఉపాధ్యాయుడిగా యుటిఎఫ్‌లో చేరి ఉపాధ్యాయ సమస్యలపైన అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మందులు సమీకరించి వాళ్లని ఆదుకోవడంలో ఓంకార్‌కు మరొకరు చాటులేరని అన్నారు. జీడి, కొబ్బరి రైతులకు బోర్డు ఏర్పాటు, గిట్టుబాటు ధర కోసం గ్రామాల్లో సభలు, సమావేశాలు పెట్టి రైతులను చైతన్యవంతులు చేసే ప్రయత్నం మరువలేనిదని వారన్నారు. కార్యక్రమంలో బమ్మిడి సుగుణవతి, నెయ్యిలో ఈశ్వరి, బమ్మిడి రామకృష్ణ, నెయ్యల సింహాచలం, తమ్మినాన లక్ష్మి, సిగిలపల్లి సరోజనమ్మ, దువ్వాడ కామేశ్వరరావు, పిర్ల గున్నమ్మ, నెయ్యల లక్ష్మి, బి.పద్మ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు టోల్ ఫీజు మినహాయించాలి

కేంద్రమంత్రి గడ్కరీని కోరిన ఎంపీ 'కలిశెట్టి'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి

ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిస్టులందరికీ, ఆయా జాతీయ రహదారులపై వసూలు చేసే టోల్ ఫీజు నుంచి మినహాయింపు ఇవ్వాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర హైవేలు, రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని పార్లమెంట్ హాల్‌ని ఆయన ఛాంబర్‌లో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నిరంతరాయంగా ప్రజల సమస్యలను తెలుసుకుని తెలియజెప్పడమే పరమావధిగా జర్నలిస్టులు ప్రయాణిస్తుంటారని, వారికి టోల్ ఫీజు పెనుభారమవుతుందని వివరించారు.

రేపు ఘంటసాల గీతామృతం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఈ నెల 4న సాయంత్రం 5 గంటలకు టి.శరత్‌చంద్ర సుస్వర సారథ్యంలో 'ఘంటసాల గీతామృతం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నిర్వహకులు గార మండలం లంకపేటకు చెందిన శరత్‌చంద్ర తెలిపారు. అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈయనతో పాటు నల్లి ధర్మారావు ఉన్నారు.

కిడ్నీ ఆస్పత్రికి మహర్దశ

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

పలాస : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆస్పత్రిలో ఎటువంటి వైద్య సేవలకు నోచుకోవడం లేదని, టిడిపి హయాంలో మహర్దశకు తీసుకొచ్చామని ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. కాశీబుగ్గ కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆస్పత్రిని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందించే సేవలను పరిశీలించారు. 2018, నవంబరు 5న అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆస్పత్రి నిర్మాణానికి వేసిన శిలాఫలకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కిడ్నీ ఆస్పత్రి నిర్మాణం చేశారే గాని... మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రారంభించారని దుయ్యబట్టారు. వైద్యాధికారులు, కిడ్నీ రోగులకు అవసరమై పరికరాలు, పరిశోధన కేంద్రానికి కావాల్సిన సౌకర్యాలు కల్పించలేక పోయారన్నారు. పలాస, హరిపురం సిహెచ్‌సిల్లోని కిడ్నీ డయాలసిస్ యూనిట్లు ఇక్కడ పెట్టి మమ అనిపించారని ఎద్దేవా చేశారు. కిడ్నీ వ్యాధులపై పూర్తి అవగాహన ఉన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అన్నారు. కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆస్పత్రిని పూర్తిస్థాయిలో హంగులు సమకూర్చి వ్యాధిగ్రస్తులకు సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. ఉద్దానం కిడ్నీ వ్యాధులపై పరిశోధనలు చేపడుతున్నామని, సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ హయాంలో ఇది పూర్తవుతుందనే నమ్మకం ఉందని అన్నారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అల్లుమల్లు పద్మజ, వైద్యులు కూన మోహనబాబు, టిడిపి నాయకులు పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బి.నాగరాజు, జోగ మల్లి, సప్ప నవీన్, అంబటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

టౌన్‌షిప్ లే అవుట్‌పై సమీక్ష

స్థానిక టిడిపి కార్యాలయంలో బొడ్డపాడులోని రెవెన్యూ పరిధి జాతీయ రహదారి సమీపంలో నిర్మాణం చేపట్టనున్న టౌన్ షిప్‌పై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. సుడా వైస్ ఛైర్మన్ బులేసు, ప్లానింగ్ అధికారి టి.జి.రామ్మోహన్, జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి కిషోర్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఇఇ సుగుణాకర్ లేఅవుట్ ప్లాన్‌ను చూపించారు. నిబంధనల ప్రకారం ప్లాట్లు విభజించి కేటాయించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామని అధికారులు తెలిపారు. ఆమెతో పాటు టిడిపి సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, ఎం.నరేంద్ర (చిన్ని) పాల్గొన్నారు.

డీలర్లు సన్మానం

వజ్రపుకొత్తూరు : ఎమ్మెల్యే గౌతు శిరీషను మండల డీలర్లు ఘనంగా ఆమె సగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తమ సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని డీలర్లు కోరారు. డీలర్ల సంఘం అధ్యక్షులు తవితయ్య, కోనేరు కామేశ్వరరావు, గౌరీ పాల్గొన్నారు.

క్రికెటర్‌కు అభినందన

మండలంలోని ఉద్దానం రామకృష్ణాపురానికి చెందిన అంతర్జాతీయ స్థాయి అంధ క్రికెటర్ దున్న వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే శిరీష తన క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. అంతర్జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ల్లో ఇండియా తరుపున ఆడి పలు అవార్డులు సాధించానని ఆమెకు క్రికెటర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఉద్యోగం, ఇతర సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గోవింద, పాపారావు, చింత నారాయణ, దున్న షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఇత్తడి బొకేతో సత్కరిస్తున్న సభ్యులు

ఎమ్మెల్యే రవికుమార్‌కు సన్మానం

పొందూరు: మండలంలోని శ్రీకూర్మం కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘానికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మంగళవారం శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో సేవాసంఘం సభ్యులు కలిసి ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా కిలో బరువు గల ఇత్తడి బొకేతో సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు అరకావల్లి శ్రీరంగనాయకులు, విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వైద్యులను సన్మానిస్తున్న హారికాప్రసాద్

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

శ్రీకాకుళం అర్బన్: వైద్యులను వైద్యో నారాయణో హరి, వారి సేవలు వెలకట్టలేనివని లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి జోనల్ ఛైర్మన్ కరణం శోభారాణి అన్నారు. నగరంలోని గాంధీనగర్‌లోని హారికా కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంలో సోమవారం రాత్రి డాక్టర్ డేను కెఎన్ఎస్‌వి ప్రసాద్ (హారికా ప్రసాద్) ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని డాక్టర్లు చింతాడ కృష్ణమోహన్, మేడిసెట్టి సత్యస్వరూప్, ఎం.వి.సత్యా నందం, రోష్ మల్లిఖార్జున్, ఇనుమల పద్మావతి, బాడాన బాలకోటేశ్వరరావు, దినేష్, దన్నాన ప్రవీణ్, కరణం హారికలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో చింతాడ శిరీష, తర్లాడ అప్పలనాయుడు, పాలిసెట్టి మధుబాబు, ఉపాధ్యక్షుడు మణిశర్మ, కార్యదర్శి మజ్జి సుమన్, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

జెండా ఊపి ప్రారంభిస్తున్న శేషగిరి

బస్సు పునరుద్ధరణ

టెక్కలి: టెక్కలి ఆర్‌టిసి డిపో నుంచి టెక్కలి–బోరుభద్ర మీదుగా విశాఖపట్నం బెళ్లే బస్సును సర్వీస్‌ని అధికారులు పునరుద్ధరించారు. దీనిని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో తిరిగిన ఈ సర్వీసును వైసిపి ప్రభుత్వంలో రద్దు చేశారని అన్నారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో మళ్లీ బస్సును సర్వీస్‌ని పునరుద్ధరంచామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పి.శ్రీనివాసరావు, టిడిపి నాయకులు టంకాల వెంకటరమణ, దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్‌చంద్, జీరు వెంకటరెడ్డి, కోరాడ రాంప్రసాద్, సంఘ నాయకులు గజివిల్లి నాగభూషణం పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

117జిఒను రద్దు చేయాలి

పలాస : పాఠశాలల విలీనానికి సంబంధించిన గత ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 117ను తక్షణమే రద్దు చేసి 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గున్న రమేష్ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఒక పిఎస్, హెచ్ఎం పోస్టును మంజూరు చేయాలని కోరారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి, ఉపవిద్యాశాఖాధికారి, డైట్ లెక్చరర్ల, జూనియర్ లెక్చరర్ల పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ రుణాల మొత్తాలను వెంటనే చెల్లించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీష్ బడిత్య, దాసరి ఈశ్వరరావు, సహాధ్యక్షులు ప్రియాంక మహారాణా, జిల్లా పూర్వ కార్యదర్శి రాజాన పరమేశ్వరరావు ఉన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బంద్ పోస్టర్ ఆవిష్కరణ

టెక్కలి: నీట్, యుజిసి నెట్ ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ ఈనెల నాలుగో తేదీన ఎల్‌కెజి నుంచి పిజి వరకు విద్యా సంస్థల బంద్ చేపడుతున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.చందు పిలుపునిచ్చారు. ఈ మేరకు టెక్కలిలో బంద్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీట్ పరీక్ష చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో ఈ ఏడాది అవకతవకలు జరిగాయని విమర్శించారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి పాలనలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయించడంలో వైఫల్యం చెందిందన్నారు. అలాగే విద్యార్థి సంఘ నాయకులపై పెట్టిన అక్రమ కేసులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు యు.దుర్గాప్రసాద్, బి.తరుణ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

నేడు అవగాహనా సదస్సు

నరసన్నపేట : స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలపై అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్టు డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు లియో గ్లోబల్ ఓవర్సీస్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డేవిడ్ ఫాలన్ హాజరవుతారని పేర్కొన్నారు. విదేశాల్లో విద్యను అభ్యసించాలనుకునేవారు ఈ సదస్సుకు వచ్చి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

కవిటి : పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్, రాజు

ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్టు అధికారంలోకి వచ్చిన వెంటనే ఏప్రిల్ నుంచి పెంచిన పింఛను లబ్ధిదారులకు నేరుగా అందించి మాట నిలబెట్టుకున్నామని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని పాతకొజ్జిరియాలో మంగళవారం ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛనును జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజుతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్, మనిచంద్ర ప్రకాష్, మురపాల కాశీప్రసాద్, బెందాళం తిరుమల, తిప్పన దుర్యోధనరెడ్డి, నాగుల హరిబెహరా, బాసుదేవ్‌రౌలో, సంతోష్‌పట్నాయక్, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి పాల్గొన్నారు.

పోలాకి: పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా టిడిపి పనిచేస్తుందని మండల పార్టీ అధ్యక్షులు ఎం.వెంకట అప్పలనాయుడు అన్నారు. పోలాకిలోని విశ్వేశ్వర నగర్‌లో పింఛన్ల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపిడిఒ ఉషశ్రీ మాట్లాడుతూ మండలంలో ఈ నెల మొత్తం 10,175 పింఛన్లకు రూ.6,67,57,500 విడుదలైందన్నారు. కార్యక్రమంలో డిటి పి.శ్రీనివాసరావు, టిడిపి నాయకులు ఎల్.రాంబాబు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తే చర్యలు

పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఇఒలు

కోటబొమ్మాళి : మండలంలోని ఆదిత్య ప్రయివేటు పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా యాజమాన్యం ముద్రించిన పుస్తకాలను విక్రయించవద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.చందు, ఉపాధ్యక్షులు ఉద్దాన దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదిత్య ప్రయివేటు స్కూల్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సమయంలో యాజమన్యం ముద్రించిన పుస్తకాలను విద్యార్థులకు అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. దీనిని గుర్తించిన వెంటనే ఎంఇఒలు ఎస్.అప్పలరాజు, ఎల్.వి.ప్రసాద్‌లకు ఫిర్యాదు చేశారు. ఎంఇఒలు వచ్చి స్కూల్‌లోని పుస్తకాల గొడౌన్‌ను సీజ్ చేశారు. చందు మాట్లాడుతూ ఏటా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ప్రయివేటు యాజమాన్యాలు దోపిడికి పాల్పడుతున్నాయని విమర్శించారు. ట్యూషన్ ఫీజుల రూపంలో వేలాది రూపాయలు వసూళ్లు చేస్తున్నాయని అన్నారు. పుస్తకాలు, యూనిఫారాల రూపంలో అదనంగా డబ్బులు వసూలు చేయడం సరికాదన్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

దాహార్తిని తీర్చడమే లక్ష్యం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజల కనీస అవసరాలను తీర్చడం, ఆరోగ్యవంతమైన జీవనానికి అవసరమైన తాగునీటి సరఫరాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) అన్నారు. జల్ జీవన్ మిషన్ నిధులతో మండలంలోని మెంటాడ పంచాయతీ గొల్లపేటలో రూ.34.10 లక్షలు, అర్జునవలస పంచాయతీ గిరివానిపాలెంలో రూ.29.90 లక్షలతో మంగళవారం ఇంటింటా కుళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వానికి అన్ని విధాలా అండగా ఉండాలని విన్నవించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గొర్లె లక్ష్మణరావు, మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, పైడయ్యరెడ్డి, కోట్ల అప్పలనాయుడు, ఈశ్వరరావు, పిసిని జగన్నాథంనాయుడు, లెంక ప్రభ, గొర్లె సాయి తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను సరఫరా చేయాలి

మాట్లాడుతున్న షణ్ముఖరావు

టెక్కలి : కూటమి ప్రభుత్వం ఇసుకను సరఫరా చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం సృష్టించిన కృతిమ కొరత వల్ల భవన కార్మికులకు పనులు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రద్దయిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పథకాలను మరలా పునరావృతం చేయాలన్నారు. రాష్ట్ర, జిల్లాస్థాయి కమిటీలను పునరుద్ధరించాలన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, వ్యవసాయశాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులు చొరవ చూపి భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై స్పందించాలన్నారు. ఈయనతో పాటు కౌన్సిల్ సభ్యులు పాల పోలారావు, సామకృష్ణ, వై.వెంకటరావు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం

ఇచ్ఛాపురం: మండలంలో కేసుపురం పంచాయతీలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మంగళవారం కాళీమాత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సూరు గంగరాజు సన్మానించారు. గంగరాజు తల్లి లేఖమ్మ ఐదో వర్ధంతి సందర్భంగా కేశుపురం, సన్యాసిపుట్టుగ, నీలాపుపుట్టుగ గ్రామాల్లో పదిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మొదటి ముగ్గురు చొప్పున మొత్తం పది మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. అనంతరం రూ.వెయ్యి నగదు, మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు, పురుషోత్తం, కామేశ్వరరావు, నరేంద్ర, భీమరాజు, చిరంజీవి, కామరాజు, లోకనాథం, కూర్మారావు, హేమసుందర్ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న గంగరాజు

మెళియాపుట్టి : అవగాహన కల్పిస్తున్న మధుబాబు

సాగుహక్కు పత్రాలపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

వ్యవసాయ భూములను కౌలుకు తీసుకొని సాగుచేస్తున్న రైతులందరూ గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా క్రాప్ కల్టివేటెడ్ రైట్ కార్డ్ (సిసిఆర్‌సి) కార్డు తీసుకోవాలని మండల ఎఒ మెట్ట మోహనరావు రైతులకు సూచించారు. మండలంలోని తోటాడ రైతు సేవా కేంద్రంలో సిసిఆర్‌సి కార్డులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిసిఆర్‌సి కార్డు కలిగి ఉండడం వల్ల కౌలు రైతులకు విత్తనాలు, ఎరువులు, రుణాలు, పంట నష్ట పరిహారం, ఈ–క్రాప్ పంట కొనుగోలు తదితర సేవలను పొందవచ్చునని తెలిపారు. వరి, ఇతర పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాలు ఉపయోగించడం వల్ల నేలలు సారవంతంగా మారుతాయని, నేలలో సేంద్రీయ కర్బనం పెంపొందించవచ్చని అన్నారు. భూసార పరీక్షా కేంద్రం ద్వారా నిర్వహించిన పంట పొలాల ఫలితాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తాండ్ర హరిబాబు, బెండి రామ్మోహన్, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ కూన సుధీర్, తోటవాడ, అక్కివరం విఆర్‌ఒలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలో గొప్పిలి, గోకర్ణపురం గ్రామాల్లోని రైతు సేవ కేంద్రంలో కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులపై పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.వి.మధుబాబు అవగాహన కల్పించారు. కౌలుదారు కార్డు 11 నెలలు కాల పరిమితి ఉంటుందన్నారు. కౌలు రైతులు విఆర్‌ఒ, విఎఎలకు దరఖాస్తుల చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఎఒ దానకర్ణుడు, కెనరా బ్యాంక్ మేనేజర్ విజయ్‌కుమార్, టిడిపి నాయకులు మాలతి ఢిల్లీరావు, వాసు, విజయ్‌కుమార్, రమేష్, లక్ష్మీనారాయణ, విఆర్‌ఒలు నరేష్, సింహాచలం, విఎఎలు పావని, వాసు పాల్గొన్నారు.

పోలాకి : కౌలు చేస్తున్న రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని మండల ఎఒ పి.చిరంజీవి సూచించారు. మండలంలోని అంపాలెం, ఉరజాం గ్రామాల కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులపై అవగాహన కల్పించారు.

రణస్థలం రూరల్ : మండలంలోని రణస్థలంలో సాగుహక్కు పత్రాలపై డిడి కె.త్రినాథస్వామి కౌలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ భానోజీనాయుడు, విఎఎలు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

కంచిలి: మండలంలోని అంపురం, గొల్లకంచిలి గ్రామాల్లో కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులపై మండల ఎఒ ధనుంజయ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం : కౌలు రైతులు విధిగా సిసిఆర్‌సి కార్డులు పొందాలని తహశీల్దార్ వి.పద్మావతి సూచించారు. మండలంలోని దిమ్మిడిజోల, కల్లాడ గ్రామాల్లోని సచివాలయ పరిధిలో కౌలు రైతులకు అవగాహనా సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఎఒ శ్రీకాంత్‌వర్మ పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులు

విద్యార్థులకు బహుమతులు

సోంపేట : మండలంలోని కొర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతిలో అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులకు అమ్మ తన్వి ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం బహుమతులు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు దుప్పట్ల సురేష్ కుమార్ విద్యార్థులకు బహుమతులను స్థానిక హెచ్ఎం బాలకృష్ణ, సర్పంచ్ ప్రతినిధి రామ్ బుడ్డి గణపతి చేతులమీదుగా అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్థ ద్వారా నిరుపేద విద్యార్థులకు చేయూత అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పంట కాలువల పనులు

ప్రజాశక్తి - జి.సిగడాం

జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ పంట కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు తెలిపారు. తద్వారా ఆయకట్టు పరిధిలోని భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందన్నారు. మండలంలోని ముశినివలస పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఓపెన్ హెడ్ ఛానల్ పూడికతీత పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలాకాలంగా పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో శివారు భూములకు సాగునీరందని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రైతులు అభ్యర్థనను పరిశీలించి యుద్ధప్రాతిపదికన పంట కాలువల పనులను చేపడుతున్నామని చెప్పారు. ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రధాన కాలువల పూడికతీత పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ ఖరీఫ్‌కు పంట కాలువల ద్వారా పూర్తిస్థాయిలో రైతులకు సాగునీరు అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం జాడ పంచాయతీలో మొక్కల పెంపకం పనులను పరిశీలించారు.

మురళీమోహనరావుకు అవార్డులు

అవార్డు అందుకుంటున్న మురళీమోహనరావు

శ్రీకాకుళం లీగల్ : సీనియర్ న్యాయవాది, శ్రీకాకుళం రోటరీక్లబ్ సెంట్రల్ ప్రెసిడెంట్ యేరుకోల మురళీమోహనరావుకు అవార్డుల పంట పండింది. ఇటీవల విజయవాడలోని ఓ కన్వెన్షన్ సెంటర్లో రోటరీ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ రావూరి సుబ్బారావు పేరుతో అవార్డులు ప్రకటించారు. అందులో భాగంగా మురళీమోహనరావు హయాంలో అత్యధిక మెంబర్‌షిప్‌లు చేర్పించడం, సమాజ సేవలను గుర్తించారు. ఈ మేరకు బెస్ట్ ప్రెసిడెంట్, ప్లాటినం, బంగారం, సిల్వర్ మొత్తం 13 బహుమతులను అందజేశారు. ఈయనకు ఐలూ జిల్లా అధ్యక్షులు దుంపల రమణారావు, న్యాయవాదులు వరద వెంకట్ గోవిందరాజులు, మండ నాగేశ్వరరావు, డాక్టర్ మెట్ట వెంకటేశ్వరరావు, మామిడి క్రాంతి, కోరాడ వైకుంఠరావు, మెట్ట వెంకటేశ్వరరావు అభినందించారు.

ఆటోలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐ దివాకర్ యాదవ్ (ఇన్‌సెట్‌లో రాజేశ్వరి (ఫైల్)

క్రైమ్ కార్నర్

వివాహిత దారుణ హత్య

ఆటోలో మృతదేహంతో పోలీస్‌స్టేషన్‌కు...

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తాడివలస–పైడిజోగిపేట రహదారి మధ్యలో నరసన్నపేట మండలం ఉర్లాంకు చెందిన ఆటోడ్రైవర్ ఆముజూరి గోపాల్ పొందూరు మండలం చిన్నబొడ్డేపల్లికి చెందిన అమలాపురపు రాజేశ్వరిని (32) మంగళవారం గొంతుపై కత్తితో కోసి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ఆటోలో తీసుకువచ్చి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన సంఘటన సంచలనంగా రేపింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హతురాలు రాజేశ్వరికి ఒరిశాకు చెందిన ఉత్తేశ్వరరావు అనే వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. భర్త అనారోగ్యానికి గురై ఏడాది క్రితం మృతి చెందారు. ఈమెకు కుమార్తెతో కలిసి స్వగ్రామమైన చిన్నబొడ్డేపల్లిలో తల్లిదండ్రులు అచ్చయ్య, రాజులు వద్దనే ఉంటుంది. గ్రామంలో చిన్నకిరాణా బడ్డీని నడుపుకుంటూ తల్లిదండ్రులను, కూతురు హాసినిని పోషించుకుంటుంది. ఈ తరుణంలో నరసన్నపేట మండలం ఉర్లాంకు చెందిన ఆటోడ్రైవర్ గోపాల్ బొడ్డేపల్లి వద్ద జరిగే రైల్వే పనులకు అక్కడి నుంచి కూలీలను ఆటోతో తీసుకువచ్చేవాడు. ఈ సమయంలో రైల్వేట్రాక్ పక్కనే బడ్డీ నడుపుతున్న రాజేశ్వరితో పరిచయం ఏర్పడింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ క్రమంలో మంగళవారం సంతకవిటి మండలం వాల్తేరులో రాజేశ్వరి బంధువుల ఇంటికి ఆటోలో వెళుంది. ఇరువురు ఆటోలో వెళ్తుండగా... తాడివలస సమీపంలో ఆటో ఆపి మాట్లాడుకునే సమయంలో ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. దీంతో గోపాల్ కోపోద్రిక్తుడై తన వెంట తెచ్చుకున్న చిన్న కత్తితో ఆమె గొంతును కోసి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ఆటోలో తీసుకువచ్చి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. దీనిపై హతురాలు తండ్రి అచ్చయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ దివాకర్ యాదవ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి నిందుతుడిని సంఘటన స్థలం వద్దకు తీసుకువెళ్లి హత్య చేసిన తీరును పరిశీలించారు. ఈయన వెంట ఎఎస్ఐ సువ్వారి రామచంద్రరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గుర్తుతెలియని యువకుడు మృతి

యువకుడు మృతదేహం

పొందూరు: పొందూరు రైల్వేస్టేషన్‌లో రైలు నుంచి మంగళవారం జారిపడి గుర్తు తెలియని యువకుడు (27) మృతి చెందినట్లు జిఆర్‌పి ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. స్టేషన్‌లోని 2,3 ప్లాట్‌ఫారాల మధ్యలో మృతదేహం పడి ఉందని అన్నారు. మృతుడు నలుపురంగు షర్టు, ఫ్యాంటు ధరించి ఉన్నాడని, శరీరం కుడి భాగాన ఛాతి నుంచి తొడలు వరకూ గతంలో కాలిపోవడంతో ఏర్పడిన నల్లని మచ్చలు ఉన్నాయని తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసినవారు 9493474582 ఫోన్ నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

ఇద్దరికి గాయాలు

నందిగాం : మండలంలోని పాలవలసపేట సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పలాసకు చెందిన కె.ప్రవీణ్‌కుమార్ తన వ్యానులు తీసుకొని క్లీనర్‌తో సహా హిరమండలం వెళ్తున్నాడు. మండలంలోని పాలవలసపేటకు వచ్చేసరికి బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో ముందు వెళ్తున్న లారీ వెనుక భాగాన ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వ్యాన్ క్యాబిన్‌లో ఉన్న ఇద్దరూ గాయపడి చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది క్రేన్ సహాయంతో ఇద్దరినీ బయటకు తీసి 108లో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తప్పిన ప్రమాదం

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడని స్టేట్ బ్యాంకు సమీపంలో మంగళవారం ఒక ప్రయివేట్ బస్సును కారు ఢీ కొట్టింది. ఎదురుగా వస్తున్న బస్సుని కారు రాంగ్ రూట్లో వెళ్లి ఢీకొట్టింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా, బస్సు ముందు భాగం దెబ్బతింది. అయితే ఎవరికీ ఎలాంటి గాయాలు లేకుండా అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

బస్సును ఢీకొన్న కారు

ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

కేశవరావుపేటలో గ్రామసభ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని కేశవరావుపేటలో సర్పంచ్ పైడి భాస్కరరావు అధ్యక్షతన మంగళవారం అభివృద్ధి పనులపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి సూర జగదీష్, మాజీ సర్పంచ్ పొందూరు భీమారావు మాట్లాడుతూ చీడికాని సమీపంలో 40 జగనన్న ఇళ్లు నిర్మించారని, ఇప్పటి వరకు విద్యుత్ సరఫరా ఇవ్వలేదని, దీంతో రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే డ్రెయినేజీలో చెత్తా చెదారం పేరకుపోయిందని, ఎవరూ పట్టించుకోవడం లేదని నిలదీశారు. అలాగే 14,15 ఆర్థిక సంఘ నిధులు ఖర్చులు ఏమయ్యాయని ప్రశ్నించారు. మస్తర్ల విషయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతికి పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పూజారి సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు బైక్ వేలం

పాతపట్నం: స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గురువారం ఉదయం 11 గంటలకు పాత కేసులో సీజ్ చేసిన బైక్‌ను వేలం వేస్తున్నామని ఎస్ఐ మహమ్మద్ యాసిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగి ఉన్న వారు ఎవరైనా వేలం పాటలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ముందుగా రూ.వెయ్యి డిపాజిట్ చేయాలన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్‌తో వేలం పాటలో పాల్గొవాలని సూచించారు.

ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

ముమ్మరంగా పారిశుధ్య పనులు

కవిటి: కవిటి పంచాయతీలో ముమ్మరంగా పారిశుధ్యం పనులు చేపడుతున్నట్టు సర్పంచ్ పూడి లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు సాయంత్రం ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత మన కనీస బాధ్యతని, ప్రతిఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి సూచించారు. కార్యక్రమంలో ఇఒ వీరభద్రస్వామి, సిబ్బంది నూకరాజు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

'చెత్త' చేస్తున్నారు

కవిటి: స్వచ్ఛ భారత్ గురించి పదేపదే అవగాహన కల్పిస్తున్నా, అను నిత్యం పారిశుధ్య పనులు చేస్తున్నా గ్రామాల్లో మార్పు రావడం లేదు. మేజర్ పంచాయతీ కవిటి - రాజపురం రహదారిలో ఎస్ఎజి విద్యా సంస్థల సమీపంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. కొంతమంది తమ వ్యర్థాలు రోడ్డు పక్కనే పారవేయడంతో స్థానికులతో పాటు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఆ ప్రాంతం నుంచి వస్తున్న దుర్గంధంతో వ్యాధులు వస్తున్నాయని, అటు విద్యార్థులు ఇటు సమీపంలో నివసిస్తున్న గృహస్తులు అంటున్నారు. గతంలో దీనిపై పంచాయతీలో ఫిర్యాదు చేస్తే పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారని, కానీ, మళ్లీ ఎప్పటిలాగే మారిపోయిందని స్థానికులు అంటున్నారు. ఇకనైనా పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టి రాబోయే రోజుల్లో ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పేరుకుపోయిన చెత్తా చెదారం

బంద్‌ను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న వినోద్‌కుమార్

పలాస : నీట్ పరీక్షల్లో జరిగినా అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దేశవ్యాప్తంగా ఈ నెల 4న జరుగు విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యుయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ కోరారు. కాశీబుగ్గలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీట్ పరీక్షా ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల్లో భావప్రకటన స్వేచ్ఛకు అవకాశం కల్పించాలన్నారు. పాఠశాలల విలీనానికి తీసుకొచ్చిన 177 జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంస్థల యాజమాన్యాలు పాల్గొని బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి సమైక్య (ఎఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవి, పవన్, తరుణ్, నాని, సాయి, కళ్యాణ్ పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

మొక్కను నాటుతున్న సభ్యులు

శ్రీకాకుళం అర్బన్ : మెక్కలను పెంచడంలో ఎంతో మానసిక ఆనందం ఉంటుందని, వాటితో స్నేహం చేయడం వల్ల పర్యావరణనాన్ని పరిరక్షించుకునేందుకు దోహదపడుతుందని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి అన్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో ఆర్ఎస్‌పి ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం మొక్కలు నాటారు. టెక్కలి డివిజనల్ ఫారెస్టు అధికారి నాగేంద్రరావు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించారు. నాటిన ప్రతి మొక్కనూ కాపాడు కోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో న్యూరో సైకియాట్రిస్టు డాక్టర్ బెండి సాయిరాం హాజరై మాట్లాడుతూ మెరుగైన మానసిక ఆరోగ్యానికి మొక్కలు నాటడం, పెంచడం ఎంతో అవసరమని అన్నారు. సైకాలజిస్టు, ఆర్ఎస్‌పి ఫౌండేషన్ ఫౌండర్ రాజశేఖర్ పొన్నాడ, నెఫ్రాలజిస్టు డాక్టర్ బి.గౌతమి, యూరాలజిస్టు డాక్టర్ బుడుమూరు రమణ, క్రిటికల్ కేర్ గురుగుబెల్లి సందీప్, డాక్టర్ అనూష, కృష్ణ భార్గవి, సింగ్ పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సేవలే గుర్తింపు నిస్తాయని తహశీల్దార్ ఎం.సురేష్ అన్నారు. మండలంలోని పాతటెక్కలి గ్రామ రెవెన్యూ అధికారి గాలి రవి ఉద్యోగ విరమణ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో మంగళవారం సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించిన అధికారులు ప్రజల మన్ననలను పొందుతారన్నారు. ఉద్యోగ జీవితంలో కుటుంబానికి దూరంగా ఉండాల్సి సందర్భాలు ఎదురవుతాయని అన్నారు. ఒత్తిళ్లు, ఆటుపోట్లు తట్టుకుని నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరగకుండా పనిచేసే ఉద్యోగి జీవితంలో ఆత్మసంతృప్తి ఉంటుందన్నారు.

సన్మానిస్తున్న తహశీల్దార్ సురేష్

అనంతరం రవి, సుధ దంపతులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిరియా రమణమూర్తి, డిటి గిరిరాజ్, ఆర్ఐ పవిత్ర, రెవెన్యూ సిబ్బంది బాబీ, సర్వేయరు తిరుపతిరావు, విఆర్ఒలు షణ్ముఖరావు, ఇందిర, అరుణ, వెంకటరమణ పాల్గొన్నారు.

అభినందిస్తున్న అధికారులు

విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి- పొందూరు

ఇటీవల అనంతపురంలో సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యాన వికలాంగులకు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆటల పోటీలో స్థానిక భవిత కేంద్రానికి చెందిన విద్యార్థి నక్కిట్ల నాగహర్షవర్ధన్ ట్రక్కింగ్ విభాగంలో తన సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా జిల్లా సహిత విద్య కో-ఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు భవిత కేంద్రాన్ని సందర్శించి విద్యార్థికి ప్రశంసాపత్రం, మెమెంటోను అందజేసి అభినందించారు. ఈయనతో పాటు అసిస్టెంట్ జిల్లా సహిత విద్య కో-ఆర్డినేటర్ ఉమా, ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, ఐఇఆర్‌టి దినేష్, రాధారాణి అభినందించారు.

వృద్ధ దంపతులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమెతమ లక్ష్యమని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు తామాడ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని పొల్లాడకు చెందిన వృద్ధ దంపతులు గోరు సీతమ్మ, సింహాచలంలకు సంస్థ తరుపున రూ.7 వేలు ఆర్థికసాయం మంగళవారం అందించారు. నిరుపేద కుటుంబం రెక్క ఆడితే గానీ డొక్కా అడని బ్రతులని, రోజు గడవడమే చాలా కష్ట తరంగా మారిందని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు చింత మోహనరావు, ఈశ్వరరావు, పాపారావు, మండల నీలయ్య, తాతయ్య, ఊర్వశి, మోహిని, రాణి, మీన, దమయంతి, సౌదామని పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

సిబ్బందితో మాట్లాడుతున్న రమణ

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కర్లమ్మలో చేపడుతున్న పారిశుధ్య పనులను టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జలజీవన్ పనులను చేస్తామని అన్నారు. గ్రామాల్లోని ప్రజలకు డయోరియా రాకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం కావడంతో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వేడి నీరు, ఆహార పదార్థాలను తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈయనతో పాటు సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్ దాస్‌నాయుడు, వైస్.సర్పంచ్ పి.మణికంఠ, కార్యదర్శి సింగిరెడ్డి రామ్‌నారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లోతుగెడ్డ హేమగిరి ఉన్నారు.

పనులను ప్రారంభిస్తున్న రాంప్రసాద్

పూడికతీత పనులు ప్రారంభం

నౌపడ : సంతబొమ్మాళి మండలం మర్రిపాడు సర్పంచ్ ప్రతినిధి రాంప్రసాద్ వంశధార 16 ఆర్ ఛానల్‌లో పూడికతీత పనులను మంగళవారం ప్రారంభించారు. రైతు సంక్షేమమే టిడిపి ప్రభుత్వ ధ్యేయమని, దానికి అనుగుణంగా టెక్కలి నియోజకవర్గంలో చిట్ట చివరి ఎకరా వరకు వంశధార నీరు అందించాలని ఇప్పటికే వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో పొల్లాడ మాజీ సర్పంచ్ రఘు, వంశధార జెఇ భాస్కరరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వ్యాధులపై అప్రమత్తం

సరుబుజ్జిలి : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టిడిపి తెలుగు యువత అధ్యక్షులు తాడేల రాజారావు సూచించారు. మండలంలోని రొట్టవలసలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పల్లవి అధ్యక్షన డయేరియా నియంత్రణపై ఇంటింటా సర్వే చేపట్టారు. ముందుగా గ్రామంలో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేపడుతూ డయేరియా వ్యాధి లక్షణా లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సురవరపు రాంబాబు, బెవర రాజారావు, రాయి రమణ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'జెమ్స్'లో రోగికి పింఛను పంపిణీ

పింఛను అందజేస్తున్న వెంకటరమణ

పలాస : మండలంలోని సరియాపల్లికి చెందిన నీటిపల్లి రామ్మూర్తి అనారోగ్యంతో రాగోలు జెమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న లక్ష్మీపురం సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్ బాలి వెంకటరమణ తన సొంత డబ్బులు వెచ్చించి జెమ్స్‌కు ఎన్‌టిఆర్ భరోసా పింఛనులను మంగళవారం అందజేశారు. వెటర్నరీ అసిస్టెంట్ చేసిన సేవను ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, కార్యదర్శి లండ శ్రీధర్ అభినందనలు తెలిపారు.